
14

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌పై

## దుష్ప్రచారం చేయడం సరికాదు


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం । 13 ఫిబ్రవరి 2026 । ■ 14 పేజీలు


# టిక్.. టిక్.. టిక్ కౌంట్‌డౌన్..!

## జడ్జిమెంట్ డే


11

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- లబ్ డబ్.. ఓటు ఎవరికేసిండ్లో
- నేడు తేలనున్న భవితవ్యం
- అభ్యర్థుల్లో టెన్షన్
- పుర పీఠంపై ఉత్కంఠ
- ఉదయం 8 గంటలకు మొదలుకానున్న ఓట్ల లెక్కింపు
- తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- మధ్యాహ్నం తర్వాత వెలువడనున్న ఫలితాలు
- సాయంత్రం గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్లు
- కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికార యంత్రాంగం
- కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత
- సెక్షన్ 163 అమలు
- ఇప్పటికే లెక్కలు వేసుకున్న అభ్యర్థులు
- అభ్యర్థులను కాపాడుకునే పనిలో పార్టీలు
- గెలపు ఓటములపై భారీగా బెట్టింగ్‌లు
- క్యాంపులకు తరలివెళ్లిన అభ్యర్థులు
- 16న కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీల చైర్మన్‌ల ఎన్నిక

**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌సహా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది మున్సిపాలిటీల ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు పెట్టనున్నారు. కాస్త గందరగోళ పరిస్థితుల్లో పోలింగ్ ముగిసినప్పటికీ.. ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం రాలేదు. దీంతో కౌంటింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొన్నది.**

ఎవరికీ వారు అంచనాల్లో మునిగి తేలుతూ గెలుస్తామా? లేదా? అన్న లెక్కలు వేసుకుంటున్నారు. పోలైన ఓ ట్లు.. అందులో మనకు వచ్చే ఓట్లు ఎన్నంటూ బేరీజు వేసుకుంటూ.. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు పరిశీలిస్తున్నారు. పోటీ చేసిన డివిజన్, వార్డుల్లో పరిస్థితి ఏంటంటూ ఆరా తీస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు క్యాంపు రాజకీయాలు మొదలుపెట్టారు. మంచిర్యాల, చెన్నూర్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి మున్సిపాలిటీకు సంబంధించి కొన్ని రాజకీయపార్టీలు తమ అభ్యర్థులను క్యాంపులకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఓ పార్టీ తన అభ్యర్థులకు మహారాష్ట్రకు తీసుకెళ్లగా, మంచిర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఓ పార్టీ క్యాంపు పెట్టారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి నాయకులు కరీంనగర్, హైదరాబాద్ ఇలా ఇతర ప్రాంతాలకు క్యాంపులకు వెళ్లినట్లు తెలిసింది. ఫలితాలు తమకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్న ఎదుర్కొనేందుకు, అభ్యర్థులను కాపాడుకొనేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. 16న కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీలకు చైర్మన్‌లు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో.. పదవులు ఎవరిని వరిస్తాయోనన్న అంచనాలు మొదలయ్యాయి. ఫలితాలపై ఉత్కంఠ పెరిగింది.


14

## తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

- మోతిగూడ, నాయక్ పోడ్రూడ గ్రామస్తులకు కలెక్టర్ హరిత భరోసా
- ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు..
- బోరుబావి తవ్వకంపై అటవీ శాఖ అధికారుల అభ్యంతరం
- వివాదం ముదరడంతో నేరుగా గ్రామానికే వచ్చిన కలెక్టర్

## గజదొంగ అరెస్ట్

- 100 వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ
- జైలుకు వెళ్లిన మారని వైనం
- 11.4 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్ - 13లో







## కదం తొక్కిన కార్మికులు

- సింగరేణిలో 'సమ్మె' సైరన్
- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- ఏకమైన కదిలిన కార్మిక సంఘాలు
- ఉమ్మడి జిల్లాలో కార్మికుల నిరసనలు..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లు, బీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని, విద్యుత్, విత్తన బిల్లులు ఉపసంహరించాలని నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఉమ్మడిజిల్లాలో గురువారం విజయవంతమైంది. కార్మిక, ప్రజా సంఘాలు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఎలుగుబంటి.. దాడిలో ఒకరు మృతి

- మరో 8మందికి తీవ్ర గాయాలు..
- సరిహద్దులోని దన్నూర్ గ్రామంలో ఘటన
- అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని అధికారుల సూచన

## బంగారం రికవరీ పేరుతో దౌర్జన్యం

- దొంగ బంగారం కొన్నాడని పోలీసుల తనిఖీలు
- బలవంతంగా 94 గ్రాముల బంగారం రికవరీ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన - 12లో



# ప్రజాస్వామ్య పండుగలో మానవీయత



- ఓటు వేయడానికి 'ఉచిత వాహన' వెసులుబాటు
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు దివ్యాంగులు, వృద్ధుల కోసం ఏర్పాట్లు
- ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి, తిరిగి సురక్షితంగా చేర్చేందుకు ఉచిత ఆటో సౌకర్యం

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ఓటు కేవలం ఒక హక్కు మాత్రమే కాదు, అది సామాన్యుడి గొంతుక. అయితే శారీరక ఇబ్బందుల వల్ల లేదా వయస్సు పైబడటం వల్ల ఎంతోమంది అర్హులైన ఓటర్లు పోలింగ్ కేంద్రాల వరకు రాలేకపోతుంటారు. ఇలాంటి వారి కోసం ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం ఒక గొప్ప ముందడుగు వేసింది. మున్సిపల్ ఎన్నికల వేళ జిల్లా కలెక్టర్ రాజర్షి షా నేతృత్వంలో, "ఎవరూ వెనుకబడకూడదు" అనే లక్ష్యంతో దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణీల కోసం ఉచిత రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఇంటి గడప వద్దకే ఆటోలను పంపి, ఓటర్లను సగౌరవంగా పోలింగ్ కేంద్రాలకు చేర్చి, మళ్ళీ సురక్షితంగా ఇళ్లకు చేర్చిన ఈ వినూత్న ప్రయత్నం జిల్లాలో భారీ ఓటింగ్ శాతానికి దారితీసింది. ప్రజాస్వామ్యాన్ని అక్షరాలా ప్రజల చెంతకు తీసుకెళ్లిన స్ఫూర్తిదాయక కథనం...

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రతీ ఓటరు తన ఓటు హక్కును సులభంగా వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు పోలింగ్ కేంద్రాలకు సులభంగా చేరుకునేలా ఉచిత వాహన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ రోజున ఓటర్లను ఇంటి వద్ద నుంచే పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి, తిరిగి సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు ప్రభుత్వ వాహనాలు (ఆటోలు) అందుబాటులో ఉంచారు. ఈ సౌకర్యం అవసరమైన వారికి సమయానికి అందేలా అధికారులు సమన్వయంతో పనిచేశారు. వృద్ధులు, శారీరక ఇబ్బందులు ఉన్నవారు ఎటువంటి అసౌకర్యం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదనే భావనతో జిల్లా యంత్రాంగం ఈ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ వాహన సౌకర్యం సక్రమంగా అందుతున్నదో లేదో పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది ప్రత్యక్ష సమన్వయంతో ఓటర్లకు సహకారం అందించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్ల ద్వారా కూడా ఈ సౌకర్యంపై అవగాహన కల్పించారు. "దివ్యాంగులను, వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లే ప్రభుత్వ వాహనం" అనే సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న ఈ చర్యలతో దివ్యాంగులు, వృద్ధులు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేసినందుకు ఓటర్లకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.






# కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



- పొరపాట్లు లేకుండా కౌంటింగ్ పూర్తి చేయాలి
- అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి సందర్శించి డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పనులు, ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజల సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కార్యాలయంలోని విభాగాలను పరిశీలించి కార్యాలయ సొంత భవనం నిర్మాణం కొరకు స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. రాంనగర్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలన...**

బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. 13వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఆయన వెంట బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్, తహసిల్దార్ కృష్ణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కన్నెర్ర

### కార్మిక సమస్యలపై కదనం
### లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం బాల భారతి హై స్కూల్ నుండి బారి కార్మిక ర్యాలీ ప్రారంభమై రాజీవ్ గాంధీ చౌరస్తా, పొట్టి శ్రీరాములు విగ్రహం, అంబేద్కర్ చౌక్ మీదుగా స్థానిక స్టేట్ బ్యాంకు ముందు వరకు ర్యాలీ జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ అయితే సభలో సిఐటియు సీనియర్ నాయకులు ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజల కష్టార్జితమైన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా మోడీ ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందిఅని, పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్ల పేరుతో కార్మికుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నారు. సామాన్య ప్రజలను విస్మరించి, కేవలం సంపన్నుల ప్రయోజనాల కోసమే కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోందని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి ఏకం కావాలి అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘము జిల్లా కన్వీనర్ ముంజం. ఆనంద్ కుమార్ ఆదివాసీ గిరిజన సంఘము జిల్లా ఉపాధ్యక్షులు కోట. శ్రీనివాస్‌లు మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది-గిట్టుబాటు ధర రైతు హక్కులు దక్కుతుందని, అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని కట్టబెట్టేలా విధానాలు రూపొందిస్తున్నారు. 29 రకాల కార్మిక చట్టాలను బ్రిటీష్ కాలం నుంచి పోరాడి కార్మికులు సాధించుకున్న చట్టాలను యజమాన్యాలకు అను కూలంగా మోడి ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతోనైనా మోడీ ప్రభుత్వం కళ్ళు తెరిచి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి." డిమాండ్ చేశారు.



## గెస్ట్ అధ్యాపకుల నూతన కార్యవర్గం

**నిర్మల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్ న్యూ గెస్ట్ ఫ్యాకల్టీ కళాశాల స్థాయి కమిటీని కళాశాలలోని అతిథి అధ్యాపకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీందర్, వైస్ ప్రెసిడెంట్‌గా సడియా తహెనియాత్, కార్యదర్శి మునవ్వార్, సెక్రటరీగా మెహెరోజ్ ఖానం, కోశాధికారిగా రాథోడ్, కమిటీ సభ్యులుగా దిలీప్ కుమార్, రంజిత్ కుమార్, నరేందర్, వెంకట్ రెడ్డి, గజల, నుస్రత్ జహాన్, తహెనియాత్ ఫాతిమాను ఎన్నుకున్నారు.

# భైంసాలో 2005 ఫలితాలు పునరావృతం

## మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

**ముథోల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

నేడు వెలువడే మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భైంసాలో 2005 సంవత్సర ఫలితాలు రిపీట్ అవుతాయని ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రేపు వెలుపడే పట్టణ మునిసిపల్ ఫలితాలలో ఏ పార్టీకి సంపూర్ణ మెజార్టీ రాదని, గంగా, యమునా నదుల కలయిక లాగా చైర్మన్ పీఠం ఎన్నుకునే పరిస్థితి ఏర్పడతాయని జోష్యం పలికారు. భైంసా పట్టణ ప్రజలకు మంచి రోజులు రానున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ప్రశాంత



వాతావరణంలో పోలింగ్ కొనసాగేందుకు సహకరించిన ప్రతి అధికారికి, ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. భైంసాలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని స్పష్టం చేశారు.

# ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయుల రెమ్యునరేషన్‌లో కోత

**నిర్మల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి పూర్తి రెమ్యునరేషన్ చెల్లించకుండా కోత విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అధికారులు హుందాగా వ్యవహరించాలని సి.పి. యస్.ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు. అనేక ఇబ్బందుల మధ్యన విధులు నిర్వహించి, ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసి, ప్రభుత్వ ప్రతిష్ట పెంచామని.. అయినా కూడా కొందరు అధికారులు తమకు రావాల్సిన రెమ్యునరేషన్ ను తగ్గించి ఇవ్వడం ఎంతవరకు సబబని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు రావాల్సిన రెమ్యునరేషన్‌లో కోత విధించకుండా పూర్తి రెమ్యునరేషన్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు.



# కౌంటింగ్ ప్రక్రియను పక్కందీగా నిర్వహించాలి

- ఉదయం 8గంటలకే కౌంటింగ్ ప్రారంభం
- మధ్యాహ్నం వరకు తేలనున్న లెక్క
- తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- కౌటింగ్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నేడు జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్‌లో, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132మంది కౌంటింగ్ సహాయకులు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 37మంది కౌంటింగ్ సహాయకులు, చెన్నూరు మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 10మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 20మంది కౌంటింగ్ సహాయకులు, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48మంది కౌంటింగ్ సహాయకులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 34 వార్డులకు గాను 17 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, చెన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి 18 వార్డులకు గాను 9 టేబుల్స్ ఏర్పాటు చేసి, 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి సంబంధించి 15 వార్డులకు గాను 8 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, క్యాతనపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 22 వార్డులకు గాను 22 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్‌కి 1 వేయి ఓట్ల చొప్పున 2రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి 60 వార్డులకు గాను 60 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్‌కి 1 వేయి ఓట్ల చొప్పున లెక్కించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

**కౌంటింగ్‌కు భారీ బందోబస్తు....**

ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. మొత్తం 800 పై చిలుకు సిబ్బందితో ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్నారు. జిల్లాలోని ఐదు మునిసి పాలిటీల పరిధిలో ఏసీపీలు 06, సీఐలు 13, ఎస్ఐలు 33, ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు 119, కానిస్టేబుళ్లు 375, హోంగార్డులు 166, ఆర్మ్‌డ్ సిబ్బంది 140, క్యూ ఆర్‌టీ టీమ్స్, రూట్ మొబైల్ పార్టీలు, ఇతర డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన 100 మంది ఎన్నికల బందో బస్తులో పాల్గొననున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉండ నుంది. కేంద్రాల వద్ద పార్టీ జెండాలు, ప్లకార్డులు ప్రదర్శించ డం, ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిశేధం. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం వంటి పనులు చేయవద్దన్నారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో




**తాండూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు గురువారం తాండూర్ తహసీల్ కార్యాలయం నుంచి ఐబీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు, పాల్గొని విజయవంతం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా, రైతు, వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను హరించి వేయడంతో పాటు కార్మిక సంఘాలను సైతం అణచివేసే విధంగా ఉన్నాయన్నారు. సమ్మెకు మద్దతుగా ఆటో యూనియన్ అధ్యక్షుడు హబీబ్ పాషా ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు ఐబీ చౌరాస్తాలో వంటవార్పు చేపట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి సిఎం కప్
# పోటీలు ప్రారంభం

**మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

సిఎంకప్- 2025లో భాగంగా జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహించడం జరిగిందని జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు దుర్గాప్రసాద్, అధికారులు, క్రీడాకారులతో కలిసి పోటీలను ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడా సేవల అధికారి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం సిఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు.గ్రామీణ, మండల, నియోజకవర్గస్థాయి స్థాయి పోటీలను పూర్తిచేసుకుని జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారని, క్యారమ్స్, చెస్, పికిల్ బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా, టైక్వాండో, సెపక్ తక్రా, ఇతర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండల విద్యాధికారి శ్రీనివాస్, డిసిబిఈ ఇంచార్జ్ మహేశ్వర్ రెడ్డి, మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రమేశ్, జిల్లా ఎస్జిఎఫ్ కార్యదర్శి ఎండి.యాకూబ్, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ రాజేష్, వ్యాయమ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు రాజయ్య, రామ్మోహన్ రావు, సూర సుదర్శన్, సిరంగి గోపాల్, బండి రవి, గాజుల శ్రీనివాస్, బెల్లం శ్రీనివాస్, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఆర్. శ్రీనివాస్ రెడ్డి, విఠల్, సంతోష్, విజయ్, నందం శ్రీనివాస్, కె.జ్యోతి, సాగర్, రోజి వరకుమారి, ఎ.వరలక్ష్మి, గుమాస వరలక్ష్మి, దాసరి మల్లేష్, సాగర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# చేతి పంపుల మరమ్మత్తు

**సారంగాపూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ప్యారమూర్ గ్రామంలో చెడిపోయిన చేతి పంపులను గురువారం సర్పంచ్ వరలక్ష్మీ మరమ్మత్తు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సాయన్న, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



# 'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచాలి

**వాంకిడి, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ఉపాధి హామీ పనులకు కూలీల హాజరు శాతం పెరిగేలా చూడాలని, వాంకిడి ఎంపీడీవో జ్యోత్స్న అన్నారు. మండలంలోని నవేగూడ, ఇందాని గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కూలీల హాజరు, పనుల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని, కొలతల ప్రకారం పనిచేయడం వల్ల రోజుకు రూ.307 పొందవచ్చుని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయాలని అప్పుడే పంచాయితీల్లో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, వంటశాల మరుగుదొడ్ల పనులను పరిశీలించి, పనుల నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు సమయానికి పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో వెంట ఏపీఓ శ్రావణ్ కుమార్, కార్యదర్శులు దినేష్, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



# క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయి

**తాండూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

క్రీడలు మానసికొల్లాసానికి, శరీర దారుద్యానికి, స్నేహ సౌభ్రాతృత్వం పెంపొందించుకోవడం కోసం ఎంతో ఉపయోగపడతాయని చౌటపల్లి సర్పంచ్ ముదాం సునీత, తాండూర్ మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి అన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం చౌటపల్లి గ్రామంలో కీర్తిశేషులు మాసాడి విష్ణువర్ధన్ స్మారక క్రికెట్ పోటీలను వారి కుటుంబ సభ్యులు, నిర్వాహకులు గురువారం నిర్వహించారు. ఈ క్రికెట్ పోటీలను ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని, క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని, క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయని సోదర భావంతో క్రీడలలో పాల్గొనాలని ఎలాంటి గొడవలకు తావివ్వకుండా జరుపుకోవాలని కోరారు. చౌటపల్లి, అంకుశం, బోయపల్లి, ద్వారకాపూర్, కాసిపేట ఐదు గ్రామపంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో మొత్తం 6 ఫ్రాంచైజెస్ టీంలు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడ పోటీలు 7 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పోటీలలో విన్నర్ జట్టుకు పదివేల రూపాయల నగదు తో పాటు షీల్డు, రన్నర్ జట్టుకు 8వేల రూపాయల నగదుతో పాటు షీల్డు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు మాసాడి శశివర్ధన్, ఆర్గనైజర్ చాందా సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాసాడి శ్రీరాములు, మాసాడి తిరుపతి, ముదాం రఘు, సుందిళ్ల భూమయ్య, డిటి రావు, చీమల రాయలింగు, శ్రీను, నిర్వాహకులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల

# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు
- ప్రతీ ఒక్కరు నిబంధనలు కచ్చితంగా పాటించాలి
- కౌంటింగ్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా









**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు లోబడి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ టీటీడీసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లు, భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, వెలుతురు తదితర సదుపాయాలను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. మొత్తం నాలుగు హాళ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 49 వార్డులకు గాను ఒక్కో వార్డుకు ఒక్కో టేబుల్ చొప్పున 49 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో సుమారు 180 మంది శిక్షణ పొందిన సిబ్బంది విధులు నిర్వహించనున్నారని తెలిపారు. ఒక్కో టేబుల్ వద్ద మూడు రౌండ్ల లెక్కింపు ఉండగా, ప్రతి రౌండ్‌కు సుమారు 90 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, వేగం కంటే ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం 2గంటలలోపు ఫలితాలు వెల్లడయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లే కౌంటింగ్‌ను కూడా క్రమశిక్షణతో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బంది, ఏజెంట్లకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అధికారులు రాథోడ్ రవీందర్, రమేష్, ఫణిందర్ తదితర రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మామిడిపూత దశలో

# సస్యరక్షణ చర్యలు పాటించాలి

### ఉద్యనవనశాఖ అధికారిణి సహజ

**దండేపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మామిడి తోటలు పూతదశకు వచ్చినందున రైతులు వాటి ఎదుగుదలకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని మంచిర్యాల డివిజన్ ఉద్యనవన అధికారిణి కందుల సహజ రైతులకు సూచించారు. గురువారం ఆమె దండేపల్లి మండల కేంద్రంలో మామిడితోటలను పరిశీలించి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. ఇప్పుడున్న మామిడి పూత దశలలో త్రిప్స్ శాతం ఎక్కువగా ఉందని వీటికి నీలి జిగట ఉచ్చులు అమర్చుకోవాలన్నారు. ఆమె వెంట ఉద్యనవన శాఖ విస్తరణ అధికారిణి రాణి, రైతుసంఘం అధ్యక్షులు బొలిశెట్టి లింగారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, రైతులు గురువయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం



**ఖానాపూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యతిరేక లేబర్ కోడ్స్, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్మిక రైతులను నిలువునా దోపిడీ చేస్తుందని, పేర్కొంటూ ఆ విధానాలను నిరసిస్తూ గురువారం నిర్మల్ జిల్లా తర్లపాడు గ్రామం వద్ద నిర్మల్ మంచిర్యాల రోడ్డుపై రాస్తారోకో, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ పలు పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తేవడం, అమలుకు పూనుకోవడం అత్యంత దుర్మార్గమని రైతు కార్మికుల పోరాటాల చరిత్ర తెలుసుకొని కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని, బిజెపి మోడీ ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాలను, విత్తన, విద్యుత్ సవరణ, విబిజి రామ్ జి బిల్లులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని, దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం దారుణమని, మోడీ పాలన అర్థరహితమని ఈ చట్టాలు రైతులను, కార్మికులను అనేక కష్టాలకు గురి చేస్తాయన్నారు.

# మహా శివరాత్రి వేడుకలకు ఆహ్వానం

**దిలావర్‌పూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
దిలావర్‌పూర్ మండలం కదిలి గ్రామంలోని శ్రీ మాత అన్నపూర్ణ పాపారేశ్వర ఆలయంలో జరగనున్న శ్రీ మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు హాజరుకావాలని రూరల్ సీఐ కృష్ణకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 15, 16 తేదీల్లో జరగనున్న జాతర ఉత్సవాలకు వేలాది మంది భక్తులు వస్తారని, పోలీస్ శాఖ తరపున పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



ఆలయ చైర్మన్ వెంకట్రావు పటేల్, ఈఓ భూమయ్య, జూనియర్ అసిస్టెంట్ మాధవరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు

# పకడ్బందీ ఏర్పాట్లు

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. సమయపాలన అత్యంత ముఖ్యమని, సిబ్బంది నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని ఆదేశించారు. అన్ని నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ, పారదర్శకంగా వేగవంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ విజయవంతంగా నిర్వహించినందుకు సిబ్బందిని అభినందించారు. అదే క్రమశిక్షణతో ఓట్ల లెక్కింపును కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. అనంతరం కౌంటింగ్ హాలుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎల్లూర్‌లో వీఓ భవన నిర్మాణానికి భూమి పూజ

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ఎల్లూర్ గ్రామంలో ఉపాధి హామీ నిధుల కింద మంజూరైన వీఓ (విలేజ్ ఆర్గనైజేషన్) భవన నిర్మాణ పనులకు సోమవారం సర్పంచ్ రవీందర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. భవనం నిర్మాణం పూర్తయిన అనంతరం గ్రామ మహిళా సంఘాలకు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు ప్రత్యేక వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నారాయణ, వార్డు సభ్యులు సునీత, దామోదర్, అశోక్, సత్యనారాయణ, రాజేశ్వర్, బాపు, శోభన్, శ్రీకాంత్, భీమయ్య, సదశివ్, పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, హౌసింగ్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమనందం పాల్గొన్నారు.






# శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్-సెటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ సంస్థను జోనల్ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు, కరీంనగర్ రీజనల్ హెడ్ అపర్ణరెడ్డి, ఆర్ - సెటి సంచాలకులు ఆశిష్ వార్లే, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతిలతో కలిసి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంచిర్యాల ప్రాంతంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉపాధి కల్పించే దిశగా అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో టాస్క్ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ అందించి ఉపాధి అవ కాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి శిక్షణ కోర్సులలో నిరుద్యోగ యువతకు నైపుణ్యత కల్పించడం జరుగుతుందని, రోబో టిక్, మిషనరీస్, ఎలక్ట్రికల్ ఇతర కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని యువత స్వయం ఉపాధి పొందాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం ద్వారా లబ్ధిదారులకు 2 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.

# ముథోల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ముథోల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** ముథోల్ నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని అందులో భాగంగానే గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రూ.1 కోటి 37 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రామ్‌టెక్ గ్రామంలో వీవో భవనం, సీసీ రోడ్డు నిర్మాణానికి, మచ్కల్ గ్రామంలో వీవో భవనం, సీసీ రోడ్డు పనులకు, ముద్గల్ గ్రామంలో వీవో భవనం ,సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. అలాగే సరస్వతినగర్ గ్రామంలో అంగన్‌వాడి భవనం, సీసీ రోడ్డు నిర్మాణానికి, బోరేగాం గ్రామంలో వీవో భవనం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. చింతకుంట గ్రామంలో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి, చింతకుంట తండాలో అంగన్‌వాడి భవన నిర్మాణానికి కూడా శంకుస్థాపనలు చేశారు. ఈ అభివృద్ధి పనులతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడి ప్రజలకు మరింత సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లవ కుమార్,ఎంపివో చంద్రశేఖర్ ఏపిఎం గురుచరణ్, ఏపీవో శిరీష రెడ్డి ఆయగ్రామాల సర్పంచులు గంగాధర్, ఆత్మస్వరుప్, అనురాధ గణపతి, లక్ష్మి గంగాధర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



### అక్రమంగా తరలిస్తున్న

# కలప స్వాధీనం

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ శాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ మేరకు వివరాలను ఎల్డీవో విశ్వనాథ్ వెల్లడించారు. ఇచ్చోడకు చెందిన గుత్తేదారు క్రాంతి, గుండాలకు చెందిన హాతీం రూ.64 వేలు విలువైన 18 టేకు దుంగలను గౌట్కూరికి చెందిన వడ్రంగి ద్వారా కొనుగోలు చేశారు. అనంతరం షేక్ అబ్బుకు చెందిన వాహనంలో తరలిస్తుండగా ఆదిలాబాద్ దస్నాపూర్ వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్ షేక్ అబ్బును అరెస్ట్ చేశామని, ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

### మున్సిపల్ ఓట్ల లెక్కింపుకు

# పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**నిర్మల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ జానకి షర్మిల పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో పార్కింగ్, బారికేడింగ్, ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ప్రవేశంపై పాటించాల్సిన విధివిధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, అనుమతి పత్రాలు ఉన్నవారికే అనుమతి ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా ఘర్షణలకు పాల్పడితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### సేవాలాల్ జయంతిని

# ఘనంగా నిర్వహించాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 20న ఖానాపూర్‌లో జరగనున్న జయంతి కార్యక్రమాల నిర్వహణపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖానాపూర్ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పారిశుధ్యం తదితర వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రాంగణంలో అంబులెన్స్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి తగిన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. భద్రతా దృష్ట్యా అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణి, డిటిడిఓ అంబాజీ, ఇతర అధికారులు, ఉత్సవ సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు, బాలింతలకు

# పోషకాహారం అందించాలి

**కుభీర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలకు వచ్చే కిషోర్ బాలికలు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికారాన్ని ప్రతి ఒక్కరికి అందించాలని వారు సూచించారు. గురువారం మండలంలోని గోడ పూర్ గ్రామ అంగన్వాడి కేంద్రాన్ని సర్పంచ్ పల్లవి దత్తహరి పటేల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలకు వచ్చే బాలింతలు గర్భిణీలు, కిషోర్ బాలికలకు ప్రభుత్వం సరాపర చేసే పౌష్టికారాన్ని అందించేలా చూడాలన్నారు. అదేవిధంగా ప్రతినెల గర్భిణులకు, కిషోర బాలురులకు బరువు కొలతలను తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూర్యకళబాయి, విద్యార్థులు, బాలింతలు ఉన్నారు.






# కార్మిక చట్టాలను కాపాడుకుందాం

**జన్నారం, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుందాం అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరం అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు కొండగుర్ల లింగన్న అన్నారు. గురువారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని తాసిల్ చౌరస్తా ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి చట్టాన్ని రద్దుచేసి సంక్షేమ పథకంగా మార్చే మోడీ చర్యలను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. పని హక్కులపై బీజేపీ ప్రభుత్వం దాడిని తీవ్రంగా ఖండించాలని సూచించారు. విబిజి రామ్‌జీ చట్టం 2025ను రద్దు చేయాలని, డిమాండ్ చేశారు. ఎంజిఎన్ఆర్ ఈజిఏను యధావిధిగా అమలు చేయాలని లేకుంటే కేంద్ర ప్రభుత్వం ప్రజా ఆగ్రహానికిలోను కాక తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఉపసంహరించుకోవాలని లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు కార్మికులంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం,జిపి, ఐకెపి,వివో ఏ,ఆర్ పి,ఉపాధి హామీ లాంటి స్కీములలో పనిచేస్తున్న వారిని కనీసం కార్మికులుగా గుర్తించలేదని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు దుర్గయ్య, తిరుపతి, సిఐటియు మండల కార్యదర్శి లక్ష్మణ్ సిఐటియు నాయకులు లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రాజన్న, రాజలింగం పాల్గొన్నారు.

# కేంద్రంలో లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

■ సమస్యలను పరిష్కరించాలని కార్మికుల కదం..
■ లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్
■ సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న ఆయా సంఘాలు





**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల మీద యుద్ధం మొదలు పెట్టిందని 2019 నుంచి ఈ యుద్ధం కొనసాగుతుందని అన్నారు. 29 రకాల కార్మిక చట్టాలను బ్రిటీష్ కాలం నుంచి పోరాడి కార్మికులు సాధించుకున్న చట్టాలను యజమాన్యాలకు అనుకూలంగా మోడి ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని అన్నారు. వెంటనే వాటిని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, దినకర్, కార్తీక్, రాజు, ఉపేందర్, తిరుపతి, వనిత, సునీత, సమ్మయ్య, నవీన్, జ్యోతి, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ జాడె ఉత్తం, ఎస్ఏఓ దేవిదాస్, జాక్ నాయకులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ :** సార్వత్రిక సమ్మెలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకుడు ముంజం శ్రీనివాస్. జిల్లా కోశాధికారి శంకర్, ప్రధాన కార్యదర్శి కూషన రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

**తిర్యాణి :** మండల కేంద్రంలో డీవైఎఫ్‌వై, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్మవహించారు. అనంతరం కుమరం భీం చౌరస్తాలో నిరసన తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు టికానంద్, సీఐటీయూ నాయకులు శంకర్, వెంకేశంగౌడ్, విజయ్, తిరుపతి, జంగు, తదితరులు పాల్గొన్నారు.

**కెరమెరి :** మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. క్యాక్రమంలో నాయకులు ఆనంద్‌రావు, రమేష్, సంతోష్, శంకర్, ప్రమీల, మంజుల, కవిత, సావిత్రి, శ్రీనివాస్, రాధాబాయి, దినేష్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జూరు :** మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణమాచారి, వసంత్, అనంతరావు, రాజేశ్వర్, స్వప్న, బాయక్క, వినోద, రోజ, వైశాలి, బాయక్క, పద్మ, సువర్ణ, కళావతి పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి :** మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీలత, విలాస్, విలాస్, నిర్మల, తారాబాయి పాల్గొన్నారు.

**రెబ్బెన :** దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, కార్మిక రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెబ్బెన తహసీల్దార్‌కు ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిరంజీవి, సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, రమేష్, రాజేశ్వరి, మాయ, తదితరులు పాల్గొన్నారు.

**దహెగాం :** మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వజ్రమ్మ, పార్వతి, మమత, శోభ, మహేశ్వరి, రాజం, వెంకటేష్, శ్రీనివాస్, వినేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్ :** మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, బస్టాండ్ ఆవరణలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**కౌటాల :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

**జైనూర్ :** మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తార, గంగామణి, మడావి కొద్దు, దివ్య జ్యోతి, రవిందర్, సీతబాయి, ఓమల, గేడాం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్(యు) :** మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

■ ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి
■ సిబ్బంది సమయపాలన పాటించాలి
■ విద్యార్థులకు పోషకాహారం అందించాలి
■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**కన్నెపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, సామగ్రి సమకూరుస్తామని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో భోజనశాల నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించా రు. మధ్యాహ్న భోజనంలో ఆహారం తయారీకి వినియోగిస్తున్న సామాగ్రిని పరిశీలించి తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను మాత్రమే వినియోగించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ నితికా పంత్ అన్నారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో భద్రత కోసం ప్రత్యేక బందో బస్తు, క్యూ ఆర్‌టీఎంలు, డాగ్ స్క్వాడ్ టీంలు, బాంబు డిస్పోసల్ టీంలు, నై?ట్రకింగ్ పోర్సులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాల నేఫథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పని సరిగా పాటించాలని చెప్పారు. పలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయాలు కాల్చడం, ఊరేగింపుకు ఎలాంటి అనుమతి లేదన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు పూర్తిగా నిషేధమని చెప్పారు. జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, గొడవలు, అల్లర్లు సృష్టించే వారిని, నిబంధనలకు విరుద్ధంగా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించే వారిని రిమాండ్‌లోకి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించేందుకు సంబంధిత అధికారుల ఉత్తర్వుల మేరకు నిర్ధేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సజావుగా చేపట్టాలని జిల్లా ఎస్పీ నికితాపంత్ తెలిపారు. గురువారం కాగజ్‌నగర్ కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. బందోబస్తు, ఏర్పాట్లు తెలుసుకుని పలు సూచనలు చేశారు.

# హక్కుల కోసం ఐక్య పోరాటం

**నిర్మల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాట చేద్దామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అంగన్వాడి ఆశ వర్కర్ల కార్యకర్తల నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ఆశ వర్కర్లకు అంగన్వాడి టీచర్లకు ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పించాలని వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సుజాత, నాయకులు రాజమణి తదితరులు పాల్గొన్నారు.



# సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ఆధ్యాత్మిక గురువు శ్రీసంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డిసిసి అధ్యక్షురాలు సుగుణ అన్నారు. జయంతి ఉత్సవాల సందర్భంగా వాల్ పోస్టర్లను జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీరా శ్యాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఇరుకుల మంగ కలసి గురువారం ఆవిష్కరించారు. జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు చౌహాన్ గునవంత్ రావ్ నాయక్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ రూపులాల్ నాయక్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, జాతి పెద్దలు, మేధావులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ కే. హరిత, అజ్మీరా శ్యాంనాయక్, డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క, మాజీ శాసన సభ్యులు ఆత్రం సక్కు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగలను మర్యాదపూర్వకంగా కలసి జయంతి సభకు హాజరుకావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్. రమాదేవి, సలహాదారులు రాథోడ్ అంబాజీ, రాథోడ్ సేసేరావ్, కమిటీ సభ్యులు బానోత్ గోపాల్ నాయక్, పవార్ రవీందర్, దారావత్ ప్రవీణ్, చౌహాన్ సునీల్, భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఫలితాలపై ఉత్కంఠ
# తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- మరికొన్ని గంటల్లో ఓట్ల లెక్కింపు
- అభ్యర్థుల్లో పెరిగిన టెన్షన్
- ఎక్కడికక్కడే కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో క్యాంపు రాజకీయాలు షురూ
- అభ్యర్థులను కాపాడుకునేందుకు పార్టీల తిప్పలు




**మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల్లో వివిధ పార్టీలు, గుర్తులపై పోటీ చేసిన అభ్యర్థుల్లో టెన్షన్ పట్టుకుంది. మరికొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుండగా, అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలనుంది. నామినేషన్లు వేసిన నాటి నుంచి అలుపెరగకుండా ప్రచారంలో మునిగి తేలిన అభ్యర్థులకు ఎన్నికలు పూర్తకావడంతో కాస్తంత ఉపశమనంలభించినప్పటికీ ఫలితాలపై చాలా మంది గంపెడాశతో ఉన్నారు. ఈ సారి ఎన్నికల్లో యువత, రాజకీయానుభవం లేనివారు అనేక మంది వివిధ పార్టీలు, స్వతంత్రులుగా బరిలో దిగారు. అలాంటి వారంతా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్దపడ్డారు. ఎట్టకేలకు పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఇక ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు శుక్రవారం చేపట్టనున్న ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. మంచిర్యాల కార్పొరేషన్‌కు సంబంధించి ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, బెల్లంపల్లి మునిసిపాలిటీలోని బజార్ ఏరియాలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు మునిసిపాలిటీలోని అటవీశాఖ సమీపంలోని జడ్పీ హైస్కూల్, క్యాతనపల్లి మునిసిపాలిటీలోని ఆర్‌కేసీఓఏ క్లబ్, లక్షెట్టిపేట మునిసిపాలిటీలో పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎక్కడికక్కడే లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**60 వార్డులు....60 టేబుళ్లు....**

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపులో భాగంగా మంచిర్యాల కార్పొరేషన్‌కు సంబంధించి 60 వార్డులు ఉండగా 60 టేబుళ్లు ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 2,01,875 ఓట్లు పోల్‌కాగా ఒక్కో రౌండ్‌కు టేబుల్‌కు వెయ్యి ఓట్ల చొప్పున మొత్తం నాలుగు రౌండ్లలో లెక్కించనున్నారు. బెల్లంపల్లి మునిసిపాలిటీకి సంబంధించి 34 వార్డులకు గాను 17 టేబుళ్లు ఏర్పాటు చేయగా రెండు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నారు. చెన్నూరు మునిసిపాలిటీలోని 18 వార్డులకు 9 టేబుళ్లు ఏర్పాటు చేయగా, రెండు రౌండ్లలో లెక్కించనున్నారు. క్యాతన్‌పల్లి మునిసిపాలిటీలో 22 వార్డులకు గాను 22 టేబుళ్లు ఏర్పాటు చేయగా, రౌండ్‌కు వెయ్యి ఓట్ల చొప్పున రెండు రౌండ్లలో పూర్తి చేయనున్నారు. లక్షెట్టిపేట మునిసిపాలిటీలోని 15 వార్డులకు గాను 8 టేబుళ్లు ఏర్పాటు చేయగా, రెండు రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు. ఇందుకోసం మునిసిపాలిటీల వారీగా రౌండ్ల సంఖ్యను బట్టి సరిపడా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ సహాయకులను నియమించారు.

**క్యాంపు రాజకీయాలు షురూ...!**

మునిసిపల్ ఎన్నికలు పూర్తయినందున వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో క్యాంపు రాజకీయాలు షురూ చేశారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు పార్టీలు మారే అవకాశం ఉండటంతో వారందరినీ రహస్య ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. మంచిర్యాల కార్పొరేషన్‌లో ఈ క్యాంపు రాజకీయాలు అధికంగా ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలో బీజేపీ తరుపున బరిలో నిలిచిన అభ్యర్థులందరినీ ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ప్రత్యేక బస్సుల్లో క్యాంపునకు తరలించారు. వారందరికీ ఆటవిడుపు కోసం మహారాష్ట్రలోని తడోభాలోని జంగిల్ సఫారీకి ఎన్నికలు ముగిసిన రాత్రికి రాత్రే తరలించారు. అలాగే కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు తమ అభ్యర్థులను క్యాంపులకు తరలించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా మునిసిపాలిటీల్లో కూడా ఇదే ఒరవడి కొనసాగుతున్నట్లు సమాచారం. ఓట్ల లెక్కింపు సమయానికి కూడావారు అందుబాటులో ఉండటం లేదు. మేయర్/చైర్మన్ ఎన్నిక రోజు ఈ నెల 16వ తేదీన అభ్యర్థులంతా క్యాంపు నుంచి నేరుగా మునిసిపల్ కార్యాలయాలకు రానున్నట్లు సమాచారం. గెలిచిన అభ్యర్థులను ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులను ఆయా పార్టీల ముఖ్య నేతలు పార్టీలు మారకుండా కాపాడుకునేందుకు క్యాంపు రాజకీయాలకు తెరతీసినట్లు సమాచారం.

# కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మె

- కదం తొక్కిన కార్మికులు
- కలెక్టరేట్ ఎదుట కార్మిక, ప్రజా సంఘాల నిరసన




**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో ఆయా కార్మిక సంఘాలు నిరసనలతో హోరెత్తించారు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ, ఐ.ఎన్.టీ.యూ.సీ, ఏ.ఐ.కే.ఎస్ ఇలా ఈనెల కార్మిక సంఘాలు వివిధ రంగాల్లోని కార్మికులతో కలిసి నిరసనలు వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కార్యాలయం ప్రధాన గెట్ ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా, పెద్దపెట్టిన నినాదాలతో హోరెత్తించారు. ఈ మేరకు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.... కేంద్రం లోని ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ 4 లేబర్ కోడ్స్‌గా నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. 4 లేబర్ కోడ్స్‌ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతూ నవంబర్ 21 న గెజిట్ విడుదల చేసిందని మండిపడ్డారు. ఈ గెజిట్ ను, లేబర్ కోడ్ లను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దు చేసి వీబి జీ-రామ్ జీ స్కీమ్ ను తెచ్చి రాష్ట్రాల పై ఆర్థిక భారం మోపిందనీ మండిపడ్డారు. విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన సవరణ చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో 100% విదేశీ పెట్టుబడు లకు అనుమతి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ కొరకు నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ లాంటి మరిన్ని వినాశకరమైన చట్టాలను బిల్లులను తీసుకొచ్చి ప్రజలపై దాడి చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం నాలుగు 4 లేబర్ కోడ్ల అమలుతో 40 కోట్ల సంఘటిత, అసంఘటిత కార్మికులు వారి కుటుంబాలు చితికిపొయ్యేలా, కార్పొరేట్లు లాభాలు పొందేలా విధానాలను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని లేనిపక్షంలో కార్మిక కర్షకులు ప్రజలు ఏకమై గద్దె దించుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**నాలుగు కార్మిక కోడ్ చట్టాలు రద్దు చేయాలి...**

దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లాలో కార్మిక, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, నిరసనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని, ఒప్పందబయటపని ఉద్యోగులను శాశ్వతం చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తిర్యాణిలో జరిగిన నిరసనలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గుండం శంకర్, కాంగ్రెస్ నాయకులు పెరుమాండ్ల వెంకటేశం గౌడ్, బుద్దే విజయ్, వ్యాపార సంఘం గౌరవ అధ్యక్షుడు సుద్దాల తిరుపతి, అధ్యక్షుడు జంగు, మధ్యాహ్న భోజన కార్మికుల నాయకురాలు చంద్రకళ, అంగన్వాడీ నాయకురాలు ఆత్రం పార్వతి, ఆశా కార్యకర్త ఆత్రం బద్రుబాయి, లక్ష్మణ్, రవి, మారుతి, రాము పాల్గొన్నారు.



## మున్సిపల్ పీఠం
# కైవసం చేసుకుంటాం
### మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ పార్టీలు లోపాయికారీ ఒప్పందాలతో కుమ్మక్కై ప్రచారం నిర్వహిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా మున్సిపల్ పీఠాన్ని బీఆర్‌ఎస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం తన నివాసంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి ఎన్ని జిమ్మిక్కులు చేసినా కాగజ్‌నగర్‌లో గెలుపు బీఆర్‌ఎస్‌కు దక్కుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**కుభీర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ఉరేసుకుని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని గొడ్సర గ్రామానికి చెందిన విద్యార్థిని (17) భైంసాలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ (ఎంపీపీఎస్) ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతురాలి స్నేహితులను విచారించగా అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో మోసగించినట్లు తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బెల్లంపల్లిలో కౌటింగ్
# రహదారి మూసివేత

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా, బెల్లంపల్లి పట్టణంలో కాంటా చౌరస్తా నుండి న్యూ బస్టాండ్ వరకు రహదారి మూసివేయబడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. ఈ నిబంధన ఉదయం 6 గంటల నుండి కౌంటింగ్ ముగిసే వరకు అమల్లో ఉంటుందని, ఇందుకు పట్టణ ప్రజలతో పాటు వ్యాపారస్తులు దుకాణాలు మూసివేసి పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఇన్స్పెక్టర్ బెల్లంపల్లి 1 టౌన్ కె. శ్రీనివాస రావు తెలిపారు.

# ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు

**గుడిహత్నూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

బోథ్ నియోజకవర్గం ఇంచార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో గుడిహత్నూర్ మండలంలోని ముత్నూర్ గ్రామ యువత, గ్రామస్తులు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ సర్పంచ్ షీలా, కాంగ్రెస్ నాయకులు అంకతి రవి, ఆడే జైపాల్, గణేష్, శ్రీధర్, సారంగపాణి, శ్రీకర్ గౌడ్ రవి, రమేష్ పాల్గొన్నారు. ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని, భవిష్యత్తులో మంచి అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు.









# లక్ష మందికి కంటి శస్త్ర చికిత్సలు

■ భోస్లే గోపాల్ రావు పాటిల్ కంటి ఆసుపత్రి ఘనత ■ ఎల్.వి ప్రసాద్ ఆసుపత్రి సేవలు అమూల్యమైనవి
■ ఆస్పత్రి వైద్యులను అభినందించిన నారాయణ రావు పాటిల్

**ముథోల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ముథోల్‌లో స్థాపించిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి లక్ష కంటి శస్త్ర చికిత్సల మైలురాయిని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భోస్లే నారాయణ రావు పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముథోల్‌లో నెలకొల్పిన భోస్లే గోపాల్ రావు కంటి ఆసుపత్రి (ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి) పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ, అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తోందన్నారు. భోస్లే నారాయణ రావు పాటిల్ కృషితో, దురదృష్టి తో ఆయన తండ్రి స్మారకార్థం 1996 డిసెంబర్ 20న భోస్లే గోపాల్ రావు పాటిల్ కంటి ఆసుపత్రిని స్థాపించినట్లు తెలిపారు. సేవాభావంతో నిరంతరం సేవలందిస్తున్న ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఒకలక్ష శస్త్రచికిత్సల మైలురాయిని సాధించడంలో ఆసుపత్రి నిర్మాణం, నిర్వహణలో వైద్యులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమన్నారు. మారుమూల ప్రాంతంలో కంటి ఆసుపత్రిని స్థాపించి వృద్ధులు, పిల్లలు, ముథోల్ ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న కంటి ఆసుపత్రి స్థాపనలో కృషి చేసిన భోస్లే నారాయణ రావు పాటిల్‌కు ముథోల్ నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. డా.రమేష్ మాట్లాడుతూ ఆసుపత్రి సేవలను మరింత విస్తరించే దిశగా ముందుకు సాగుతున్నామని, పేదలకు మరిన్ని సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భోస్లే నారాయణ రావు పాటిల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, సీనియర్ నాయకులు కిషన్ పటేల్, రైతు నాయకులు ప్రేమ్ నాథ్ రెడ్డి, ముథోల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, లోకేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ యాదవ్, బాసర మాజీ సర్పంచ్ రమేష్, అష్ట సర్పంచ్ లావణ్య, ముథోల్ సర్పంచ్ హేజాజుద్దీన్, శెట్టి రవి కుమార్ పాల్గొన్నారు.




## సింగరేణిలో మోగిన సమ్మె సైరన్

**మందమర్రి, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు, 44 చట్టాలను 29 చట్టాల సవరణ చేసిన బిల్లు కు వ్యతిరేకంగా గురువారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సింగరేణిలో సమ్మె సైరన్ మోగింది. సింగరేణి కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటియూ, టీబీజీకేఎస్ వంటి సంఘాలు జేఏసీగా ఏర్పడి సింగరేణి కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి. దేశవ్యాప్త సమ్మెకి నిరసనగా శ్రీరాంపూర్ బస్‌స్టాండ్ వద్ద రోడ్ పైనా ధర్నా చేపట్టిన ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య నిరసన లో పాల్గొన ఇతర కార్మిక సంఘాలు .ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడుతూ భారత కార్మిక వర్గం 100 సంవత్సరాల పైగా పోరాడి సాధించుకున్న 44 చట్టాలు. ఇందులో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లను తీసుకొని వచ్చి కార్మికులను యాజమాన్యాలకు కట్టుబనిసలు చేసిన నరేంద్ర మోడీ కి వ్యతిరేకంగా ధర్నా చేపట్టామన్నారు. ఏప్రిల్ 1 వ తేదీన బిల్లు అమలు లోకి తీసుకొని రావాలని పార్లమెంట్ లో బిల్లు పాస్ చేశారు. అదానీ, అంబానీ లుబడా వ్యాపార వేత్తలకు సింగరేణి కాంట్రాక్ట్ పనులను అప్పచెప్పిన ఘనత బీజేపీ ప్రభుత్వం కి సాధ్యమైంది అన్ని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చినపుడు మాత్రం మత రంగుతో ప్రజలందరినీ చీల్చి బీజేపీ ఓట్లు అడుగుతున్నది.ఇప్పటికీ నాలుగు దఫాలుగా భారత కార్మిక సంఘాలు సమ్మెను చేశాం. అనేక రాష్ట్రాల్లో అసెంబ్లీ లో తీర్మానం చేసి నాలుగు కోడ్ లు రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వంకి సిఫారసు చేశాయి. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా అసెంబ్లీలో నాలుగు కోడ్ వ్యతిరేకంగా బిల్లు ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలని కోరారు. కార్మికులకు మెడికల్ బోర్డ్ జాప్యం చేయకుండా అమలు చేసే ప్రయత్నంతో పాటు సొంత ఇంటి పథకాన్ని కార్మికులను వర్తింప చేయాలి. ఇన్కమ్ టాక్స్ విషయంలో అధికారులు పునరాలోచించాలి. కార్మిక సంఘాలు కలిసిబిఎంఎస్ తప్ప జేఏసీగా ఏర్పడి సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు. నిరసన చేపట్టిన కా ర్మిక సంఘాలను శ్రీరాంపూర్ సిఐ శ్రీలత, ఎస్సై మేకల సంతోష్, అదనపు ఎస్సై లక్ష్మీ ప్రసన్న అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## ఉత్సాహంగా జిల్లాస్థాయి సీఎం-కప్ పోటీలు



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి సీఎం-కప్ పోటీలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమైయ్యాయి. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. ఖోఖో, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, నెట్ బాల్, సాఫ్ట్ బాల్, బాల్ బాడ్మింటన్, యోగా పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పోటీలో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని క్రీడాకారులకు సూచించారు. ఆదిలాబాద్ జిల్లాను పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా క్రీడా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రోబోటిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో స్లేట్ విద్యార్థుల ప్రతిభ



### విద్యార్థులను చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి

**జన్నారం, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ఈ బాట్ ప్లస్ ఇన్నోవిటి రోబోటిక్స్ ఛాంపియన్ షిప్ 2025-26 పోటీలలో మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించారని స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ పోటీకి సంబంధించిన ఆన్లైన్ పరీక్ష జనవరి 10వ తేదీన నిర్వహించగా స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ 7వ తరగతికి చెందిన విద్యార్థులు శౌర్య, శ్రేయస్, వైభవలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి రూ.5000 నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా స్లేట్ విద్యాసంస్థల చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను చదువుతోపాటు సాంకేతిక రంగాలలో రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో తీర్చిదిద్దడమే స్లేట్ విద్యాసంస్థల లక్ష్యమని భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను తీర్చిదిద్దిన ఇంచార్జి ఉపధ్యాయురాలు శ్రావణితో పాటు విద్యార్థులను చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ శిరీన్ ఖాన్, ఉపాధ్యాయులు జాకీర్, అస్మా అభినందించారు.




## కార్మిక కోడ్‌లను రద్దు చేయాలి

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
కొత్త కార్మిక కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని ఆదిలాబాద్ శాఖ ఎల్ఎస్ఐసీ బీమా ఉద్యోగుల సంఘం బాధ్యులు గురువారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఆదిలాబాద్ శాఖ కార్యదర్శి చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని సమయాన్ని 8 నుంచి 12 గంటలకు పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో సంఘం అధ్యక్షుడు నసీరుద్దీన్, ఉపాధ్యక్షుడు గణేష్, సభ్యులు ఫహీం సిద్ధికి, రవికుమార్ పాల్గొన్నారు.

## రేపు జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో 14వ తేదీన జిల్లా స్థాయి సీఎం కప్ స్విమ్మింగ్ పోటీలు నిర్వహిం చనున్నట్లు డీవైఎస్వో జక్కుల శ్రీనివాస్ గురువారం తెలిపారు. స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిని రవికుమార్, కొమ్ము కృష్ణ, హరిచరణ్, స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు రాష్ట్రపాల్ నేతృ త్వంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారుల వయస్సు ఆధారంగా గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు విభాగాలవారీగా పోటీలు నిర్వహించను న్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో సీఎం కప్ పోటీలకు దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులే అర్హులని వివరించారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ నితికాపంత్ అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలోని డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాట్లను, స్ట్రాంగ్ రూంలను గురువారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూం పరిసరాలు, తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం





లేకుండా మూడంచెల భద్రతా వ్యవస్థను అమలు చేయాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ రోజున కేంద్రాల పరిసరాల్లో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్-ఎస్)సెక్షన్ 163 అమలులో ఉంటుందని చెప్పారు. అనధికార వ్యక్తులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది తప్ప మరెవ్వరు కౌంటింగ్ కేంద్రాల పరిధిలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతర నిఘా, గస్తీ, కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమం లో డీఎస్పీ వహీదుద్దీన్, సీఐ ప్రేంకుమార్, బాలాజీ వరప్రసాద్, సతీష్, మున్సిపల్ కమిషనర్ గజానంద్ తదితరులు ఉన్నారు.





# మెన్షన్ హౌస్ మల్లేష్ టీజర్ అదిరింది!

టాలీవుడ్‌లో ప్రస్తుతం రూరల్ బ్యాక్‌డ్రాప్ కామెడీ సినిమాలకు మంచి ఆదరణ లభిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడూ అదే కోవలో తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. శ్రీనాథ్ మాగంటి హీరోగా, బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను కనకమేడల ప్రొడక్షన్స్ పతాకంపై రాజేష్ నిర్మించారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ టీజర్ చూస్తుంటే.. 'శంకరమ్మ టెంట్ హౌస్' నడుపుకుంటున్న కథానాయకుడు (శ్రీనాథ్ మాగంటి) పెళ్లి జరుగగా.. శోభనం రోజు రాత్రి పెళ్లి కూతురు సడన్ షాక్ ఇస్తుంది. మరి పెళ్లి కూతురు ఇచ్చిన షాక్ ఏంటి. ఈ షాక్ తిన్న మన హీరో ఏం చేశాడు అనేది ఈ సినిమా కథ. ఈ చిత్రం మార్చి 06 ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.ఈచిత్రంలో శ్రీనాథ్ మాగంటితో పాటు, గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. మురళీధర్ గౌడ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి వంటి సీనియర్ ఆర్టిస్టులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అమ్మ ముత్తు సినిమాటోగ్రఫీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఎడిటింగ్ బాధ్యతలను గ్యారీ బి.హెచ్ నిర్వహించారు.



## ఆ జాబితాలోకి 'ది ప్యారడైజ్..

సినిమాని ప్రకటిస్తూనే.. విడుదల తేదీ వివరాలు వెల్లడించడం, అనుకున్న సమయానికి వర్క్ పూర్తి కాకపోవడంతో వాయిదా వేయడం.. టాలీవుడ్‌లో ఇటీవల ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పుడా జాబితాలో 'ది ప్యారడైజ్' చేరింది. ఈ యాక్షన్ డ్రామా మూవీ ఆగస్టు 21కి వాయిదా పడింది. భారతీయ భాషలతోపాటు ఇంగ్లిష్, స్పానిష్‌లో రిలీజ్ కానుంది. మార్చి 26న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రమిది. తమ కాంబినేషన్‌లో ఇంతకుముందు వచ్చిన 'దసరా'ను మించేలా ప్లాన్ చేస్తున్నారు. రెండు జడలతో కూడిన నాని లుక్‌తోపాటు మోహన్‌బాబు, సంపూర్ణేశ్‌బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

## కియారా నెక్స్ట్ టార్గెట్ ఇదే!

'టాక్సిక్' చిత్రంలో నదియాగా ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోంది అందాల తార కియారా అడ్వాణీ. ప్రస్తుతం మాతృత్వపు దశను ఆస్వాదిస్తున్న ఈమె.. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. "బరేలీ కీ బర్ఫీ', 'పంగా' లాంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకురాలు అశ్వినీ అయ్యర్ తివారీతో ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిందట కియారా. "ఇప్పుడు రాబోయే ప్రాజెక్టు ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. ఇప్పటికే దీని గురించి కియారా, దర్శకురాలి మధ్య చర్చలు పూర్తయ్యాయి. ఈ చిత్రాన్ని శక్తిమంతమైన మహిళా ప్రాధాన్య కథగా తీర్చిదిద్దనున్నారు. కియారా 'టాక్సిక్' చిత్ర షూటింగ్‌ను పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ"ని కియారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.



# మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పటిష్ట బందోబస్తు

- కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచల భద్రత
- టీటీడీసీ ప్రాంగణంలో 163 బిఎన్ఎస్ఎస్ అమలు
- విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవు
- సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధం
- అధికారుల అనుమతి తీసుకున్న తరువాతే విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
నేడు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ప్రతిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పూర్తిగా మూడంచల భద్రతతో పటిష్టమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం స్థానిక టిటిడిసి ప్రాంగణం నందు జరగనుండగా ప్రాంగణం పరిసర ప్రాంతాలలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉందని, ప్రజలు గుంపులు గుంపులుగా తిరగడానికి అనుమతులు లేవని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికలలో విజయం పొందిన నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి అనుమతులు లేవని తెలిపారు. మరుసటి రోజు సంబంధిత అధికారుల అనుమతులు తీసుకొని నిర్దేశించిన రోజు మాత్రమే విజయోత్సవ ర్యాలీలను నిర్వహించాలని తెలిపారు. టపాకాయలు పేల్చుడానికి, డీజే సౌండ్‌లకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలందరూ నియమ నిబంధనలు పాటించి, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా సహకరించాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా "ఐలవ్ ఆదిలాబాద్ నుండి మావల పోలీస్ స్టేషన్ వరకు" ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్టు, రేపు ఉదయం నుండి ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు ఆంక్షలు కొనసాగుతాయని ప్రజలు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాలలోనికి వచ్చే ఏజెంట్లకు గానీ అభ్యర్థులకు గానీ సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతులు లేవని, అదేవిధంగా ఇంకు పెన్నులు లాంటి వాటిని తీసుకురావద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ సష్టం చేశారు.



### అడవి పంది దాడిలో గాయపడ్డ
## మహిళను పరామర్శించిన ఎఫ్‌డీవో

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం పెద్ద సాల్యాడకు చెందిన ఇస్రు బాయి అనే మహిళ అడవి పంది దాడిలో గాయపడగా, ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఆమెను ఎఫ్.డి.ఓ చిన్న విశ్వనాథ్ భుసరెడ్డి పరామర్శించారు. డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తక్షణ సహాయం అందించడంతో పాటు, ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో పూలజీబాబా కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాండురంగ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో శివుడు, విఠల్, పాండు, నగేశ్, పద్మల్ రాజు, సందీప్, శ్రీనివాస్, రమణ,కిషన్, గంగాధర్, గణేష్, సురేశ్ పాల్గొన్నారు.

## క్రీడాసామగ్రి అందజేత

**సాత్నాల, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మండలం కెనాల్ మెడిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం తనపుట్టినరోజుని పురస్కరించుకొని రిమ్స్ ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్న సంతోషిని, రాధాకృష్ణ దంపతులు పాఠశాల విద్యార్థులకు వారు క్రీడా సామగ్రిని అందజేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



### డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి

**మందమర్రి, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లావ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో హస్తానిదే విజయమని దీనికి కారణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాహితం కోసం సంక్షేమ కార్యక్రమాల వ ల్లనే సాధ్యమైందని డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం క్యాతన్‌పల్లి మున్సిపాలిటి కాంగ్రెస్ అభ్యర్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిష్టానం చెప్పినట్లు అందరూ నడుచుకోవాన్నారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం మంత్రి వివేక్ వెంకటస్వామి కృషి చేశారని తెలిపారు. అటు చెన్నూర్ క్యాతన్‌పల్లి మున్సిపాలిటిలో దాదాపు 200 కోట్ల అభివృద్ధి పనులు ప్రారం భించామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ఇందిరమ్మ ఇళ్లు, రోగులకు పెన్షన్‌లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 250 ఉచిత విద్యుత్‌తోపాటు రేషన్‌కార్డులు ఇచ్చిన ఘనత ప్రభుత్వానిదే అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎన్నికల్లో ఎత్తుగడులు వేశాయని అవి ఫలించలేదన్నారు. నియో జకవర్గంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నాయకులు లేని పోని ఆరోపణలు చేస్తున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నికలప్పుడు ఎలా ఉండేదో ప్రజలు గమనించాలన్నారు. అటు క్యాతన్‌పల్లి, చెన్నూర్, మంచిర్యాల కార్పొరేషన్, లక్షెట్టిపేట, బెల్లంపల్లిలో మంచి మెజార్టీతో విజయం సాధిస్తున్నట్లు తెలి పారు. అనంతరం అభ్యర్థులను క్యాంపునకు తరలించారు. నాయకులు రాజు, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, లక్ష్మన్, కిరణ్ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఓట్ల లెక్కంపునకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ కోసం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆసిఫాబాద్ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఒక హాల్‌లో ఐదు టేబుల్‌ల చొప్పున రెండు హాల్‌లలో 10 టేబుళ్లు ఏర్పాటు చేసి 20 వార్డులను రెండు రౌండర్లలో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కౌంటింగ్ కేంద్రాన్ని కాగజ్‌నగర్ పట్టణంలోని డీఏవీ పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని, 30 వార్డులకు గాను రెండు రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ సహాయకులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ చేపడతున్నామని అన్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది తమకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలకు ఉదయం 6.30 గంటలకు చేరుకోవాలని సూచించారు.

### సింగరేణి సీఎండీని
## కలిసిన ఎస్టీపీపీ ఈడీ

**జైపూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరె క్టర్ (సీఎండీ)గా నియమితులైన జ్యోతి బుద్ధ ప్రకాశ్‌ను ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి గురువారం హైదరాబాద్ లోమర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిర్వహణతో పాటు కొత్తగా నిర్మిస్తున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణ పనులపై చర్చించినట్లు తెలిసింది.

## నిబంధనలు పాటించాలి

**శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
పర్యావరణ నిబంధనలు పాటిస్తూ పనిచేయాలని తెలంగాణ ఫారెస్ట్ అధికారులు సింగరేణి అధికారులకు సూచించారు. మందమర్రి ఏరియా పరిధిలోని ఆర్కేపీ ఓసీపీ గని విస్తరణ కోసం సేకరించాల్సిన అటవీ భూమికి బదులుగా సమాన విస్తీర్ణంలో వృక్ష సంపదను పెంచడం కోసం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సమీపంలో ఓబీ డంప్ యార్డు సమీప స్థలాన్ని గురువారం పరిశీలించారు. రాష్ట్ర అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవ ఐన్, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సంహిత, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారావు, మం చిర్యాల జిల్లా అటవీ అధికారి అశీస్సింగ్ సింగ పూర్ పరిసర ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, కంపెనీ ఫారెస్ట్ అడ్వై జర్ మోహన్ చంద్ర పర్లేన్, మందమర్రి జీఎం రాధాకృష్ణ, ఎస్టేట్స్ జనరల్ మేనేజర్ లక్ష్మీపతిగౌడ్, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు, ఏరియా ఎస్టేట్ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు చేయాలి

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
రైతుల వద్ద ఉన్న పత్తిని సీసీఐ మార్చి 31 వరకు కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి పంటకు నష్టం వాటిల్లిందని, ఆ తర్వాత క్రాప్ వచ్చిందని, నాణ్యత లేదని కొనుగోలు నిలిపివే యడం సరికాదన్నారు. పూర్తిస్థాయిలో పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20 వరకు కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించడం సరికాదన్నారు. మహారాష్ట్రలో పత్తి కొనుగోలు చేస్తుందని, ఇక్కడ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు.

# గెలుపుపై ఎవరి ధీమా వారిదే


**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొన్నది. గెలుపు ఓటముల విషయం శుక్రవా రం తేలనుంది. అభ్యర్థులు, పార్టీల భవితవ్యం తేలిపోనుంది. ఎన్నికల్లో చివరి అంకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ మరికొన్ని గంటల్లో పూర్తి కానుంది. గతంలో ఎన్నడు లేని విధంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపుపై ప్రతి ఒక్కరి దృష్టి కేంద్రీకృతమైంది. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికలు హోరహోరీగా కొనసాగాయి. రెండు మున్సి పాలిటీల పరిధిలోని పట్టణ ఓటర్లు బుధవారం పోలింగ్ ద్వారా ఇచ్చిన తీర్పు ఎలా ఉంటుందో శుక్రవారం తేటతెల్లం కానుంది. అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల్లో నెలకొన్న ఎడతెగని ఉత్కంఠకు శుక్రవారం తెరపడనుంది. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలలో ఎవరు నెగ్గుతారు, ఎవరు ఓటమి పాలవుతారో ఎవరి విజయ అవకాశాలను ఎవరు దెబ్బతీస్తారో మున్సిపల్ చైర్మన్ పదవులు ఏ పార్టీని వరిస్తాయే అనే విషయంపై ఆయా పట్టాణాల్లో చర్చ కొనసాగుతోంది.



# టిక్.. టిక్.. టిక్

# కౌంట్‌డౌన్..!

## జడ్జిమెంట్ డే



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

■ లబ్ డబ్.. ఓటు ఎవరికేసిండ్లో ■ నేడు తేలనున్న భవితవ్యం ■ అభ్యర్థుల్లో టెన్షన్
■ పుర పీఠంపై ఉత్కంఠ ■ ఉదయం 8 గంటలకు మొదలుకానున్న ఓట్ల లెక్కింపు
■ తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ■ మధ్యాహ్నం తర్వాత వెలువడనున్న ఫలితాలు
■ సాయంత్రం గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన ■ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్లు
■ కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికార యంత్రాంగం
■ కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ■ సెక్షన్ 163 అమలు
■ ఇప్పటికే లెక్కలు వేసుకున్న అభ్యర్థులు ■ అభ్యర్థులను కాపాడుకునే పనిలో పార్టీలు
■ గెలపు ఓటములపై భారీగా బెట్టింగ్‌లు ■ క్యాంపులకు తరలివెళ్లిన అభ్యర్థులు
■ 16న కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీల చైర్మన్‌ల ఎన్నిక

**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌సహా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది మున్సిపాలిటీల ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు పెట్టనున్నారు. కాస్త గందరగోళ పరిస్థితుల్లో పోలింగ్ ముగిసినప్పటికీ.. ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం రాలేదు. దీంతో కౌంటింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొన్నది.** ఎవరికీ వారు అంచనాల్లో మునిగి తేలుతూ గెలుస్తామా? లేదా? అన్న లెక్కలు వేసుకుంటున్నారు. పోలైన ఓ ట్లు.. అందులో మనకు వచ్చే ఓట్లు ఎన్నంటూ బేరీజు వేసుకుంటూ.. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు పరిశీలిస్తున్నారు. పోటీ చేసిన డివిజన్, వార్డుల్లో పరిస్థితి ఏంటంటూ ఆరా తీస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు క్యాంపు రాజకీయాలు మొదలుపెట్టారు. మంచిర్యాల, చెన్నూర్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి మున్సిపాలిటీకు సంబంధించి కొన్ని రాజకీయపార్టీలు తమ అభ్యర్థులను క్యాంపులకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఓ పార్టీ తన అభ్యర్థులకు మహారాష్ట్రకు తీసుకెళ్లగా, మంచిర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఓ పార్టీ క్యాంపు పెట్టారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి నాయకులు కరీంనగర్, హైదరాబాద్ ఇలా ఇతర ప్రాంతాలకు క్యాంపులకు వెళ్లినట్లు తెలిసింది. ఫలితాలు తమకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్న ఎదుర్కొనేందుకు, అభ్యర్థులను కాపాడుకొనేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. 16న కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీలకు చైర్మన్‌లు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో.. పదవులు ఎవరిని వరిస్తాయోనన్న అంచనాలు మొదలయ్యాయి. ఫలితాలపై ఉత్కంఠ పెరిగింది.

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఓట్ల లెక్కింపు కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ర్యాండమైజేషన్ పద్ధతిలో కౌంటింగ్ అసిస్టెంట్లు, హెల్పర్స్, ఆర్‌వోలు, నోడల్ ఆధికారులను నియమించారు. మధ్యాహ్నం తర్వాత ఫలితాలు వెలువడే అవకాశాలున్నాయి. ఈ మేరకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాల సమీపం లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించిన వారికే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించనున్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, లైటర్లు లాంటి వస్తువులు కేంద్రంలోకి తీసుకెళ్లడంపై నిషేధం విధించారు. అధికారులు, పోలీసులు, ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి టీటీడీసీలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 49 వార్డులకు సంబంధించి 49 టేబుళ్లను ఏర్పాటు చేశారు. టేబుల్‌కు ఇద్దరు చొప్పున కౌంటింగ్ అసిస్టెంట్లు, నలుగురు కౌంటింగ్ నోడల్ ఆఫీసర్లు, 11 మంది ఆర్‌వోలు, 11 మంది ఏఆర్‌వోలను నియమించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆసిఫాబాద్ బల్దియా ఎన్నికల ఓట్ల లెకింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒక హాల్‌లో ఐదు టేబుల్స్ చొప్పున రెండు హాల్‌లలో 10 టేబుల్స్ ఏర్పాటు చేసి 20 వార్డులను రెండు రౌండ్‌లలో ఓట్ల లెకింపు చేయనున్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 60 డివిజన్‌లకు 60 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 132 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 66 మంది సూపర్‌వైజర్లు, రెండు టేబుళ్లకు ఒకరు చొప్పున 30 మంది ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (ఆర్‌వో)లు కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీకి సంబంధించి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో ఓట్ల లెక్కంపు చేయనున్నారు. మొత్తం 18 వార్డులకు తొమ్మిది రూమ్‌లలో ఒక్కో టేబుల్ చొప్పున ఏర్పాటు చేశారు. తొలి రౌండ్‌లో తొమ్మిది వార్డుల ఫలితాలు లెక్కిస్తారు. ఆ ఫలితాలు వెల్లడించాక రెండో రౌండ్‌లో మరో తొమ్మిది వార్డుల ఓట్లు లెక్కించనున్నారు. 10 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 20 మంది కౌంటింగ్ సహాయకులను నియమించారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీకి సంబంధించి పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 15 వార్డులకు 8 టేబుల్స్ ఏర్పాటు చేసి రెండు రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులను కేటాయించారు.



కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కౌంటింగ్ కేంద్రాన్ని కాగజ్‌నగర్ పట్టణంలోని డీఏవీ పాఠశాలలో ఏర్పాటు చేశారు. 30 వార్డులకు రెండు రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు కౌంటింగ్ సహాయకులు విధులు నిర్వహిస్తారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మొదటి అంతస్తులో ఎడమ వైపు కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. నిర్మల్ మున్సిపాలిటీలోని 42 వార్డుల కౌంటింగ్‌కు 22 టేబుల్స్, బ్యాలెట్ బాక్సులకు ఒక టేబుల్ మొత్తం 23 టేబుల్స్ ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సూపర్ వైజర్లు 23 మంది, అదనంగా మరో ఐదుగురు మొత్తం 28, కౌంటింగ్ అసిస్టెంట్‌లు 46 మంది, అదనంగా తొమ్మిది మంది మొత్తం 55 మంది ఉండగా నిర్మల్‌లకు 83 మంది విధులు నిర్వహిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో గల మొదటి అంతస్తు కుడివైపు భైంసా మున్సిపల్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. భైంసా మున్సిపాలిటీలో 26 వార్డుల కౌంటింగ్‌కు 13 టేబుల్స్, బ్యాలెట్ బాక్సులకు ఒక టేబుల్ మొత్తం 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. సూపర్ వైజర్లు 14 మంది, అదనంగా ముగ్గురు మొత్తం 17 మంది, కౌంటింగ్ అసిస్టెంట్‌లు 28 మంది, అదనంగా ఆరుగురు మొత్తం 34 మంది మొత్తం 51 మంది విధులు నిర్వహించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఖానాపూర్ మున్సిపల్ కౌంటింగ్ చేపట్టనున్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీలోని 12 వార్డుల కౌంటింగ్‌కు ఆరు టేబుల్స్, బ్యాలెట్ బాక్సులకు ఒక టేబుల్ మొత్తం ఏడు టేబుల్స్ ఏర్పాటు చేశారు. సూపర్ వైజర్లు ఏడుగురు, అదనంగా ఒక్కరు మొత్తం ఎనిమిది మంది, కౌంటింగ్ అసిస్టెంట్‌లు 14 మంది, అదనంగా ముగ్గురు మొత్తం 17 మంది, మొత్తం 25 మంది విధులు నిర్వహిస్తున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించి బజార్ ఏరియాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓట్ల లెక్కింపు చేయనున్నారు. మొత్తం 34 వార్డులకు సంబంధించి 17 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు. రెండు రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 37 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు లెక్కింపులో పాల్గొననున్నారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆర్కేసీవోఏ క్లబ్‌లో ఏర్పాట్లు క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ఆర్‌కే సీవోఏ క్లబ్‌లో కౌంటింగ్ నిర్వహించనున్నారు. 22 వార్డులకు 22 టేబుళ్లు పెట్టి కౌంటింగ్ నిర్వహించనున్నారు. 12 మంది రిటర్నింగ్ అధికారులు, 24 మంది సూపర్‌వైజర్లు, 44 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 24 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. ఫలితాలు మధ్యాహ్నంలోపు వెలువడే అవకాశాలున్నాయి.











# నేడే బల్దియా ఎన్నికల ఫలితాలు

- అభ్యర్థులకు కౌంటింగ్ ఫీవర్
- ఫలితాలపై ఉత్కంఠం
- అభ్యర్థుల గెలుపు ఓటములపై బెట్టింగ్
- కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేసిన అధికారులు



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** ఫలితాలపై అభ్యర్థుల్లో ఉత్కంఠత నెలకొంది. ప్రధాన పార్టీ అభ్యర్థుల గెలుపు ఓటమిపై ఎక్కడ చూసిన చర్చ జరుగుతుంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ 34 వార్డుల్లో అభ్యర్థులను రంగంలోకి దింపింది. బీజేపీ 20, సీపీఐ 6 స్థానాల్లో పోటీ చేసింది. ప్రధాన పార్టీల మధ్యనే గెలుపోటములు ఉన్నాయి. ఫలితాలు ఎలా వస్తాయని దానిపై ప్రధాన పార్టీలు చర్చించుకుంటున్నాయి. మెజార్టీ స్థానాల విజయాలపైనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఫలితాలను ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటినుంచే సమీకరణలు చేస్తున్నాయి.

**చైర్మన్ పీఠంపైనే కన్ను...**

మున్సిపల్ పరిపాలన పగ్గాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దృష్టి పెట్టాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సమీక్షలు, లెక్కలు వేసుకుంటూ వ్యూహ, ప్రతివ్యూహాలు చేస్తున్నాయి. మెజార్టీ స్థానాలపైనే భారం వేసుకున్నాయి. ఒక వేళా తక్కువ స్థానాలు వస్తే ఏం చేయాలని ఇప్పటి నుంచే వ్యూహాల్లో ఉన్నారు. చైర్మన్ పగ్గాలు చేపట్టేందుకు గెలిచే అభ్యర్థులను ముందే గుర్తించి వారిని మంచిక చేసుకొని టచ్‌లో ఉంచుకుంటున్నారు. ప్రధానంగా గెలుపు దిశలో కనిపిస్తున్న ఉన్న కాంగ్రెస్ రెబల్స్ అభ్యర్థులపై దృష్టి పెట్టారు. వారిని మలుచుకునేందుకు ప్రలోబపెడుతున్నారు. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులను సహితం చేరవేసే పనిలో ఉన్నారు. ఏమి చేసైనా సరే.. బెల్లంపల్లి బల్దియాపై విజయ కేతనం ఎగురు వేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెగపోటీ పడుతున్నాయి. అందుకోసం చైర్మన్ అభ్యర్థులను ఇప్పటికే ఎంపిక చేసుకున్నారని ప్రచారం ఉంది. కౌంటింగ్‌లో వెల్లడయ్యే ఫలితాలు అనుకూలంగా వస్తే ముఖ్య నాయకులు రంగంలోకి దిగనున్నారు.



## కూలీ పనికి వచ్చి తిరిగిరాని లోకాలకు

**బైక్ అదుపుతప్పి యువకుడు మృతి**

**మరో ఇద్దరికి తీవ్రగాయాలు**

**జైపూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో జగిత్యాల జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సం ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు జగిత్యాల జిల్లా మేడిపల్లికి చెందిన తూర్పాటి అభి (19), పెంబట్లకు చెందిన పురాణం రవి, పస్తం అరుణ్ ముగ్గురూ స్నేహితులు. చెన్నూర్‌లో పత్తి లోడింగ్ చేసేందుకు ఈనెల 11న ముగ్గురూ కలిసి ఒకే బైక్‌పై కూలీ పనికి వచ్చారు. రాత్రంతా పనిచేసిన యువకులు గురువారం తెల్లవారు జామున లక్షెట్టిపేటకు బయ లుదేరారు. రసూల్పల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి డివైబర్‌ను ఢీకొట్టారు. అభి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక క్కడే మృతి చెందాడు. రవి, అరుణ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు. అభి తండ్రి అంజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# బంగారం రికవరీ పేరుతో దౌర్జన్యం

**దొంగతనం చేసిన బంగారం కొన్నాడని తనిఖీలు**

**బలవంతంగా 94 గ్రాముల బంగారం రికవరీ**

**ఆలస్యంగా వెలుగులోకి ఘటన**

**మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** దొంగబంగారం రికవరీ పేరుతో పక్క జిల్లాకు చెందిన పోలీసులు జిల్లా కేంద్రానికి చెందిన ఓ బంగారం దుకాణం యజమానిపై అత్యుత్సాహం ప్రదర్శించి దౌర్జన్యంగా 94 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు.. ఈనెల 9న కొందరు వ్యక్తులు దుకాణంలోకి వచ్చి తాము పోలీసులమని చెప్పారు. వారితో వచ్చిన మరో వ్యక్తిని చూపించి ఇతను చోరీ చేసిన 94 గ్రాముల బంగారం నీకే అమ్మానని చెబుతున్నాడని కాదన్నా వినకుండా సదరు యజమానిని కారులో ఎక్కించుకొని ఏసీసీలోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లారు. దొంగను అతని కళ్లముందే చితకబాదారు. ఇతనిపై 33 చోరీ కేసులున్నాయి. బంగారం కొన్నానని ఒప్పుకోక పోతే 33 కేసుల్లో దొంగ బంగారం నీకే అమ్మాడని కేసు నమోదు చేస్తామన్నారు. బెదిరించి అతని వద్ద నుంచి వాంగ్మూలం రికార్డు చేసుకున్నారు. అక్కడి నుంచి వచ్చిన ఓ పోలీస్ అధికారి గద్దెరాగడిలోని తమ ఇంటికి తీసుకెళ్లి టీతాగించాడు. ఆ తర్వాత బంగారం దుకాణానికి వచ్చి 45 గ్రాముల బిస్కిట్ బంగారం, 49 గ్రాముల నెక్లెస్ స్వాధీనం చేసుకున్నారు. కాగా దొంగను తన కళ్లముందే చితకబాదుతుంటే ప్రాణభయంతో ఒప్పుకున్నానని బంగారం దుకాణం యజమాని ఆరోపిస్తున్నాడు.

# చిన్నారుల సమాచారం ఇవ్వండి



**చిన్నారులను అపహరించిన ముఠాను**

**అరెస్టు చేసిన కాజీపేట టాస్క్ ఫోర్స్, పోలీసులు**

**మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** కాజీపేట పోలీస్, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో చిన్నారులను అపహరించిన ముఠాను టాస్క్ ఫోర్స్, కాజీపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో నిందితులను విచారించగా మరో ముగ్గురు చిన్నారులు వివిధ ప్రాంతాల్లో అపహరణకు గురై ప్రస్తుతం శిశు సంక్షేమశాఖ సంరక్షణలో ఉన్నారని వరంగల్ పోలీస్ కమిషనర్ సప్రీత్ సింగ్ తెలిపారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో చిన్నారుల్లో ఒకరైన ఆరేళ్ల వయస్సు గల బాబును 2023 అక్టోబర్‌లో కాజీపేట రైల్వే ఫ్లాట్‌ఫాం నుంచి, ఏడు నెలల పాపను గతేడాది మంచిర్యాల రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో, మరో ఐదు మాసాల పాపను రామగుండం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో అపహరిం చినట్లు వివరించారు. చిన్నారుల తల్లిదండ్రులు వారికి సంబంధించిన సరైన ఆధారాలతో కాజీపేట ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డిని 8712685122 నంబరులో సంప్రదించాలని కమిష నర్ సూచించారు.



## మూడంచెల భద్రత

**ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు**

**సీపీ అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఫలితాల వెల్లడి తర్వాత విజయోత్సవ ర్యాలీలు, సభలు, సంబరాలు, సమవేశాలు, డీజే సౌండ్స్ నిషేధం విధించినట్లు తెలిపారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట, క్యాతనపల్లి కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందో బస్తుతో పాటు 100 మీటర్ల పరిధిలో వెలుపలి రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన ధికార వాహనాలు, వ్యక్తులకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఎన్నికల అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగి ఉన్న వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని అన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువు లు, లైటర్లు, మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలకు అనుమతి లేదని, అందరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమతించాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు ఎక్కడ గుంపులు గుంపులుగా ఉండకూడదని తెలిపారు. ముగ్గురు డీసీపీలు, ఏడుగురు ఏసీపీలు, 33మంది సీఐలు, 96మంది ఎస్సై లు, 149మంది ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు, 518మంది కానిస్టేబుళ్లు, 263 మంది స్పెషల్ ఫోర్స్ సిబ్బంది ఎన్నికల బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు.

## 'మున్సిపల్'లో కాంగ్రెస్ పైచేయి

**నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు,**

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్**

**ఖానాపూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** జిల్లాలోని ఖానాపూర్, నిర్మల్, భైంసా మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచి చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, జేఏసీ పేరిట దొరలు ఆడిన నాటకాలను ప్రజలు నమ్మలేదన్నారు. పదేళ్ల ఖానాపూర్ వెనుకబాటుకు కొంతమంది దొరలే కారణమని విమర్శించారు. గోండు బిడ్డ ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం దొరల ఆటలు సాగవని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో 9 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల కోసం పనిచేసిన పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మె ల్యేపై దుష్ప్రచారం చేస్తే ఓట్లు వస్తాయని బీఆర్ ఎస్, బీజేపీ చేసిన కుట్రలను ప్రజలు గమనించారు ని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో కరపత్రాలు పంచి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దని, బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేయాలని జేఏసీ నాయకులు ప్రచారం చేశారని తెలిపారు. జేఏసీ నాయకులు ప్రజల పక్షాన ఉంటే వారే జేఏసీ తరఫున అభ్యర్థు లను ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఆయా పార్టీలతో లోపాయికారి ఒప్పందం చేసుకుని వారి అభ్యర్థులకు లాభం చేకూరేలా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారన్నారు. సమవేశంలో దయానంద్, ఎంఏ.మాజిద్, చిన్నం సత్యం, రాజేందర్, యూసుఫఖాన్, కావలి సంతోష్, రమేశ్, రాజేశ్వర్, జన్నారపు శంకర్, కస్తూరి మహేందర్, నేత శ్యాం, అమానుల్లాఖాన్, షౌకత్ పాషా, రాజేందర్నాయక్, జంగిలి శంకర్, షబ్బీర్ పాషా, గంగనర్సయ్య, వెంకటప్పయ్య, మ్యాదరి రాజేశ్వర్, చరణ్, అయూబ్ పాల్గొన్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)** పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో న్యాయవాది మార్కపురి తిలక్‌పై పోలీసుల దాడికి నిరసనగా మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. ఈ సం దర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# గజదొంగ అరెస్ట్





**100 వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ**
**జైలుకు వెళ్లి వచ్చినా మారని వైనం**
**11.4 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం**
**వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
వరస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ గజదొంగను అరెస్టు చేసినట్టు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని కేసు వివరాలను వెల్లడించారు. ఉట్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరసగా ఏడు దొంగతనాలు జరిగిన ఘటనలో అదే మండలానికి చెందిన టేకం రామారావును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు నిందితుడిపై మొత్తం 36 కేసులు నమోదై ఉండగా, కరీంనగర్, సిద్దిపేట్ ప్రాంతాల్లో దొంగతనాలు చేసినందుకు గతంలో రెండు సంవత్సరాల జైలు శిక్ష సైతం అనుభవించి ఇటీవల విడుదలయ్యాడు. తిరిగి ఉట్నూర్ మండలంలో వరుసగా ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. జైలు నుంచి విడుదలయిన వెంటనే మంచిర్యాలలో స్కూటీ దొంగతనం చేసి ఉట్నూరుకు వచ్చి, ఊరు శివారులో పాడుబడ్డ ఇళ్లలో, నిర్మాణం జరుగుతున్న ఇళ్లలో నివాసం ఉంటూ, రాత్రి సమయాలలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడు దొంగిలించిన బంగారం, వెండి సామాగ్రితో మంచిర్యాల వైపు పారిపోతుండగా.. కొత్తగూడ ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండి నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ వివరించారు. నిందితుడి నుంచి మొత్తం 11.4 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఉట్నూర్ సీఐ ఎం.ప్రసాద్, ఎస్సై గుంపుల విజయ్ మరియు పోలీస్ సిబ్బంది ఆర్ శ్యామ్ రావు, బి.నరేష్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రత



**ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు**
**అనుమతి ఉన్నవారికే ప్రవేశం ఎస్పీ జానకీ షర్మిల**

**నిర్మల్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో కౌంటింగ్ ప్రక్రియపై పోలీసు అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ బారికేడింగ్, ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ప్రవేశంపై పాటించాల్సిన విధివిధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనుమతి పత్రాలు ఉన్న సిబ్బంది, ప్రతినిధులను మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతాచర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు, గస్తీ బలగాల మోహరింపు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ రాజేశ్‌మీనా, నిర్మల్ ఏఎస్పీ సాయికిరణ్, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.





# గోమాతను కాపాడుకుందాం

**జగదీష్ అగర్వాల్ పిలుపు**

**ఇచ్చోడ, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ మండలం మాదాపూర్ గ్రామ శివారులోని విట్టల్ రుక్మిణి ఆలయంలో జరుగుతున్న గోమాత భగవత్ కార్యక్రమంలో సనాతన ధర్మ హిందూ వేదిక వ్యవస్థాపకులు జగదీష్ అగర్వాల్ పాల్గొన్నారు. గోమాత హత్యను నివారించడానికి అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తమ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కమిటీలు వేసి ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంతోష్, సూర్యకాంత్, ముకుంద్, వెంకన్న, పాల్గొన్నారు.

# ముగ్గురు విలేకరులపై కేసు

**జన్నారం, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్ యాజమానులను డబ్బులు ఇవ్వాలని బెదిరించిన ముగ్గురు విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. అంబటి శరత్, తుడుం జితేందర్, దాసండ్ల నవీన్ ట్రాక్టర్ యాజమానులను డబ్బులు ఇవ్వాలని, లేనిపక్షంలో అటవీ శాఖ అధికారులకు చెప్పి ట్రాక్టర్లను సీజ్ చేయిస్తామని 15 రోజులుగా బెదిరిస్తున్నారన్నారు. గురువారం జన్నారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన నూనావత్ విజేష్ ఇం దిరమ్మ ఇళ్ల కోసం వాగులో నుంచి ఇసుక తీసుకువస్తుండగా ఫొటోలు తీసి ఒక్కొక్కరికి నెలకు రూ.5వేల చొప్పున ఇవ్వాలని బెదిరించారు. విజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# వేతనాలు చెల్లించకపోతే సమ్మె తప్పదు




**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్, సహాయ ఇంజనీర్ సోనీ, ఎల్అండ్‌టి ప్రాజెక్టు మేనేజర్ ముత్తుస్వామికి వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, ఎఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ బకాయి వేతనాలు విడుదల చేసి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాపిడి బాలేష్, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు జంషెడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి షకీర్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతికి గిరిజన శాఖ సిద్ధం



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఫిబ్రవరి 17న శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గిరిజన సంక్షేమ శాఖ కృషి చేస్తోంది. ఉప సంచాలకులు ఆర్ రమాదేవి ఈ విషయాన్ని గురువారం తెలిపారు. జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి సభకు ఆహ్వానించి, ప్రభుత్వం విడుదల చేసిన నిధులను మంజూరు చేయాలని, సాంప్రదాయ కళా కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తీసుకొస్తున్న కలపను పట్టుకున్నామని ఏడీఎఫ్ విశ్వనాథ చిన బూసరెడ్డి తెలిపారు. గురువారం అటవీ శాఖ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి డీఎఫ్‌వోకు వచ్చిన సమాచారం మేరకు ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్ తన సిబ్బందితో దస్నాపూర్ వద్ద మ్యాక్స్ వాహనాన్ని తనిఖీ చేయగా కలప లభ్యమైందన్నారు. 18 దుంగలను గుర్తించి తరలిస్తున్న వాహనం డ్రైవర్ షేక్ అబ్బుతోపాటు దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అయితే అదే సమయంలో అతనితో ఉన్న మరో ఇద్దరు పరారైనట్టు తెలిపారు. ఇచ్చోడకు చెందిన గుత్తేదారుడు క్రాంతి ఆదిలాబాద్‌లో ఇంటి నిర్మాణానికి గుండాలలోని హతీంను సంప్రదించారని, ఆయన దుంగలను సమకూర్చి తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నామని తెలిపారు. డ్రైవర్, గుత్తేదారుడు క్రాంతితోపాటు కలప ఇచ్చిన హతీం, వామన్‌లపై కేసు నమోదు చేశామన్నారు. కలప విలువ దాదాపు రూ. 64 వేలు ఉంటుంది. వారి వెంట సెక్షన్ ఆఫీసర్ గులాబ్‌సింగ్, మావల బీట్ ఆఫీసర్ కృష్ణనాయక్ ఉన్నారు. కాగా.. అక్రమ కలప రవాణా వెనుక అటవీ సిబ్బంది హస్తం ఉందా? అనే కోణంలో కూడా జిల్లా ఆటవీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



**ఇచ్చోడ మండలంలో..**
అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు ఇచ్చోడ ఎఫ్ఆర్‌వో పుండలిక్ తెలిపారు. గురువారం మండలంలోని నవేగాం గ్రామంలో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామానికి కిశోర్ నిల్వ ఉంచిన టేకు కలపను పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.13,400 ఉంటుందన్నారు.

# సెలూన్ షాప్‌లో చోరీ

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఉన్న స్మార్టు సెలూన్ దుకాణంలో చోరీ జరిగినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. బుధవారం సాయంత్రం దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లగా రాత్రి షాపు వెనుక వైపు కిటికి రాడ్లు విరగ్గొట్టిలోనికి ప్రవేశించిన దుండగులు కౌంటర్‌లో ఉన్న రూ.18,600 ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. షాపు యజమాని భూమేష్ ఫిర్యాదు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతు న్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



# తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

- ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు
- మోతిగూడ, నాయక్ పోడ్గూడ గ్రామస్తులకు కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ హరిత భరోసా
- బోరు తవ్వకంపై అటవీ అధికారుల అభ్యంతరం
- నేరుగా గ్రామానికే వచ్చిన కలెక్టర్, డీఎఫ్ఓ..

**లింగాపూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె హరిత అన్నారు. మండలంలోని జాములధరా గ్రామంలో గురువారం రెండో రోజు మధ్యాహ్నం వరకు ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామానికి చేరుకుని పూర్తి విషయాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం కలెక్టర్ కె. హరిత హామీతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. బోరు బావిని ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాములధరాలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల చేత సంయుక్తంగా సర్వే నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ప్రజలకు రక్షిత నీటి సదుపాయం కల్పించేందుకు అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎఫ్వో నిరంజన్, ఎఫ్ఆర్వో రమేశ్., ఎంపీడీవో రాంచందర్, తహసీల్దార్ నాగరాజు, సీఐ రమేష్, ఎస్సై గంగన్న, నాయకులు అనీల్, రాహుల్, చిరంజీవి పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌పై

# దుష్ప్రచారం చేయడం సరికాదు

### కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి చంద్రయ్య



**ఉట్నూర్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్‌లోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలు మూత పడే అవకాశాలు ఉన్నాయనే భయంతోనే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌పై దుష్ప్రచారం చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు లింగంపల్లి చంద్రయ్య, దాడండ్ల ప్రభాకర్, దూట రాజేశ్వర్, మార్సుకోల తిరుపతి, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జైవంత్ రావు, మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థులు ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఎంతో కృషితో ఉట్నూర్‌లో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఇటీవల ఖానాపూర్‌లో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ ఏర్పాటులో దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ స్కూల్ ఏర్పాటు వల్ల ఉట్నూర్‌లో బీజేపీ నేతకు చెందిన ప్రైవేట్ విద్యా సంస్థలు మూత పడతాయని భయంతో గిరిజన ప్రాంత విద్యార్థులను దోచుకోవడమే లక్ష్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయడమే ఆ పార్టీల నాయకులు లక్ష్యంగా కుట్ర చేస్తున్నారనీ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల దుష్ప్రచారం తిప్పి కొట్టి విధంగా తంగిన బుద్ధి చెప్పాలని, త్వరలోనే ఒక జెఏసీని ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆన్సర్, లాజర్, నిస్సార్, అశోక్, జాదవ్ రాజేష్ పాల్గొన్నారు.



## మహిళ సాధికారతే లక్ష్యంగా

# 'ప్రగతి' కార్యక్రమం

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**జైనథ్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**



మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత, సాధికారత లక్ష్యంగా 'ప్రగతి' కార్యక్రమాన్ని గురువారం జైనథ్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ టెలికాం మౌలిక వసతుల సంస్థ ఇండస్ టవర్స్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా, పింకిషే ఫౌండేషన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందన్నారు. రుతుక్రమంపై ఉన్న అపోహలను తొలగించి కిశోర బాలికలు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు అవసరమని పేర్కొన్నారు. 'ప్రగతి' కార్యక్ర మాన్ని జిల్లాలో నిబద్ధతతో అమలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుపై దృష్టి సారించి ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో అవకాశాలు సాధించాలని సూచించారు. ఇండస్ టవర్స్ ప్రతినిధి అరుణ్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య పరిరక్షణకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచడం ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలి పారు. అనంతరం మోడల్ స్కూల్‌కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి, ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, సంతోష్ రామ్, సీసీఈఓ అరుణ్, పింకిషే ఫౌండేషన్ ప్రతినిధులు శాతిని గుప్తా, అరుణ్ గుప్తా, జైనథ్ సర్పంచ్ మమత, ప్రత్యుష, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎలుగుబంటి దాడిలో ఒకరు మృతి

### 8 మందికి గాయాలు

**బోథ్, ఫిబ్రవరి 12 (ప్రభాత సమాచారం)**

ఎలుగుబంటి దాడిలో ఒకరు మృతి చెందగా.. మరో 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలుకా దయాల్ దన్నూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలువురు రైతులు ఈనెల 10 న రాత్రి సమయంలో మొక్క జొన్న పంటకు నీరు అందించేందుకు పొలానికి వెళ్లారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న సర్వే నెం.89 వ్యవసాయ భూమిలో దత్త బలిరాం జాదవ్ (55) పై ఎలుగుబంటి దాడి చేసింది. గ్రామానికి చెందిన మరో 8 మంది రైతును కాపాడే ప్రయత్నంలో వారు సైతం దాడికి గురయ్యారు. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడగా.. వారిలో ముగ్గురిని నాందేడ్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి, ఒకరిని సంబాజీ నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్ స్పెక్టర్ డి గురుస్వామి మాట్లాడుతూ బోథ్ మండలంలోని సరిహద్దు ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతానికి వెళ్ళవద్దని సూచించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు ఏదైనా ప్రమాదం అనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.





విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY